బాధిత కుటుంబానికి అండగా ఉంటా

- మక్తల్ ఎమ్మెల్యే శ్రీహరి

తిమ్మప్ప మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే శ్రీహరి

మక్తల్‌టౌన్, మార్చి 23: అనారోగ్యంతో మృతి చెందిన తిప్పన్న కుటుంబానికి అండగా ఉంటానని మక్తల్ ఎమ్మెల్యే శ్రీహరి అన్నారు. శనివారం మండలంలోని రుద్ర సముద్రంలో కాంగ్రెస్ నాయకుడు తిమ్మప్ప మృతిచెందగా, ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీ కోసం కష్టపడి పని చేసిన తిమ్మప్ప మరణం పార్టీకి తీరనిలోటన్నారు. బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చి, వారికి అండగా ఉంటానని హామీ ఇచ్చారు.

ధన్వాడలో..

ధన్వాడ, మార్చి 23 : మండల కేంద్రానికి చెందిన వేణుగోపాల్ కుమారుడు భరత్ మృతిచెందగా, విషయం తెలుసుకున్న నారాయణపేట ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి బాధిత కుటుంబాన్ని శనివారం పరామర్శించారు. భరత్ మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

అడ్డాకుల మండలంలో..

మూసాపేట(అడ్డాకుల), మార్చి 23 : అడ్డాకుల మండలం శాఖపూర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ గ్రామాధ్యక్షుడు నాగరాజు తల్లి కోటమ్మ(65) కిడ్నీ సమస్యతో బాధపడుతూ మృతి చెందింది. విషయం తెలుసుకున్న జెడ్పీటీసీ రాజశేఖర్‌రెడ్డి శనివారం శాఖపూర్‌కు వెళ్లి కోటమ్మ మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించి. కుటుంబ సభ్యులను పరామర్శించారు. అదేవిధంగా మండలంలోని ఆయా గ్రామాల బీఆర్ఎస్ నాయకులతో సమావేశమై సమస్యలపై చర్చించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ జయన్నగౌడ్, యాదయ్య, వెంకటయ్య, మండల కోఆప్షన్ సభ్యుడు ఖాజా గోరి, నాయకులు విజయ్‌కుమార్‌రెడ్డి, కావలి కృష్ణయ్య, పిరికి శ్రీనివాసులు, రమేశ్, తిరుపతయ్య నాయకులు పాల్గొన్నారు.

కనీస వేతనం వచ్చేలా 'ఉపాధి' కల్పించాలి

- ఇసుక అక్రమ రవాణా జరుగకుండా చర్యలు తీసుకోవాలి
- నాగిరెడ్డి చెరువులో ఉపాధి పనులను పరిశీలించిన కలెక్టర్ శ్రీహర్ష

లింగాల్‌చేడ్ వాగును పరిశీలిస్తున్న కలెక్టర్ శ్రీహర్ష

మద్దూర్ (కొత్తపల్లి), మార్చి 23 : ఉపాధి హామీ కూలీలకు రోజుకు కనీస వేతనం వచ్చేలా పని కల్పించాలని నారాయణపేట కలెక్టర్ కోయ శ్రీహర్ష సూచించారు. శనివారం మద్దూరు మండల కేంద్రంలోని నాగిరెడ్డి చెరువులో ఉపాధి హామీ పథకం కింద కొనసాగుతున్న చెరువు పూడికతీత పనులను ఆయన పరిశీలించారు. కూలీలతో మాట్లాడుతూ రోజుకు ఎంత కూలీ పడుతుందని, పనులు ఎన్నిరోజులుగా చేస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. ఉపాధి కూలీల మస్టర్‌ను పరిశీలించారు. కనీస వేతనం వచ్చేలా పనులు చేయించాలని టి.ఏ భానుప్రియను ఆదేశించారు. అనంతరం నిడ్జింతగ్రామ శివారులోని ఓ రైతు పొలంలో జరుగుతున్న పాంపండ్ పనులను పరిశీలించారు. అక్కడి నుంచి కొత్తపల్లి మండల పరిధిలోని లింగాల్‌చేడ్ వెళ్లి ఇసుక రీచ్‌ను పరిశీలించారు. ఇసుక అక్రమ రవాణా జరుగకుండా చర్యలు తీసుకోవాలని తాసీల్దార్ అనిల్‌కుమార్‌ను ఆదేశించారు. ఇసుక రీచ్ వద్ద నిర్మించే చెక్ డ్యాం పనుల గురించి సంబంధిత అధికారులతో చర్చించారు. మూడు నెలల్లో చెక్ డ్యాం నిర్మాణ పనులు పూర్తయ్యేలా చూడాలని అధికారులకు సూచించారు. ఇసుక రీచ్ నుంచి ట్రాక్టర్ల ద్వారా వెళ్లే ఇసుక తరలింపు ప్రక్రియను కలెక్టర్ కాలినడకన వెళ్లి పరిశీలించారు. అనుమతి లేకుండా ఒక్క ట్రాక్టర్ కూడా బయటకు వెళ్లకుండా నిఘా పెట్టాలని ఆదేశించారు. అనంతరం పదో తరగతి పరీక్ష కేంద్రాలను పరిశీలించారు. కార్యక్రమాల్లో మద్దూర్ ఎంపీడీవో జయరాములు, ఏపీవో సిద్దేశ్వర్, ఈసీ రవికుమార్, సాయినాథ్ పాల్గొన్నారు.

అవగాహన సదస్సు

మాగనూరు, మార్చి 23: ప్రతి పిల్లాడిని చదివించే బాధ్యత తల్లిదండ్రులదే అని, వారిని పనుల్లో పెట్టినా, బాల్యవివాహాలు చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యుడు యాదయ్య అన్నారు. శనివారం మండలంలోని వడ్వాట్ జెడ్పీహెచ్ ఎస్‌లో ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ విద్యార్థులకు, పిల్లల తల్లిదండ్రులకు బాలల హక్కులపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్ పర్సన్ అశోక్ శ్యామల, కమిటీ మెంబర్ యాదయ్య, రాధ, కమల, లీగల్ ఆఫీసర్ కవిత, ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయురా లు అనిత, ఎంఐఎస్, సీఆర్‌పీ, చైల్డ్ హెల్ప్ లైన్ కోఆర్డినేటర్, సూపర్‌వైజర్, కౌన్సిలర్లు ఉన్నారు.

కుష్టువ్యాధి నిర్మూలనే ప్రభుత్వ లక్ష్యం

నవాబ్‌పేట, మార్చి 23 : కుష్టువ్యాధి నిర్మూలనకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక కార్యాచరణతో ముందుకు వెళ్తున్నాయని జిల్లా కుష్టువ్యాధి నియంత్రణ అధికారి జరీనాభాను పేర్కొన్నారు. ఈనెల 11వ తేదీ నుంచి మండలంలో చేపడుతున్న కుష్టువ్యాధి నిర్ధారణ కార్యక్రమంలో భాగంగా రుద్రారంలో వైద్యసిబ్బంది చేపడుతున్న ఇంటింటి సర్వే కార్యక్రమాన్ని జరీనాభాను, ఇతర వైద్యాధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగానే సర్వే సిబ్బందితో వివరాలు అడిగి తెలుసుకున్నారు. సర్వేను పకడ్బందీగా చేపట్టాలని, ఇందుకు ప్రజలంతా సహకరించాలని కోరారు. వ్యాధి నిర్ధారణ అయిన వారికి ప్రత్యేక చికిత్స అందించి వ్యాధిని తగ్గించేందుకు ప్రత్యేక కోర్సు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి డా.నరేశ్‌చంద్ర, సిబ్బంది శ్రీనివాస్, హన్మంతరావు, కలమ్మ, శరభలింగం పాల్గొన్నారు.

హోటళ్లు, బేకరీల తనిఖీ

మహబూబ్‌నగర్‌టౌన్, మార్చి 23: పురపాలిక శాఖ, ఫుడ్ సేఫ్టీ అధికారులు సంయుక్తంగా శనివారం పట్టణ కేంద్రంలోని పలు హోటళ్లు, బేకరీలలో తనిఖీలు చేశారు. దాదాపు రూ.11 వేల జరిమానా విధించారు. కొన్ని హోటళ్లలో నిర్వహణ సరిగా లేకపోవడంతో శాంపిల్స్ సేకరించి లాబొరేటరీకి పంపారు. కార్యక్రమంలో ఫుడ్ సేఫ్టీ అధికారి మనోజ్‌కుమార్, పారిశుధ్య విభాగ అధికారులు ఉన్నారు.

యూపీఎస్‌లో ఫుడ్ ఫెస్టివల్

ఊట్కూర్, మార్చి 23: మండలంలోని నిడుగుర్తి యూపీఎస్‌లో ఫుడ్ ఫెస్టివల్ వేడుకలను హెచ్‌ఎం లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులు ఘనంగా నిర్వహించారు. వివిధ రకాల పోషకాల వంటలు తయారుచేసి ప్రదర్శించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ ప్రతినెలా నాలుగో శనివారం నిర్వహించే నోబ్యాగ్ డే కార్యక్రమంలో భాగంగా విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంచేందుకు ఫుడ్ ఫెస్టివల్ నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పద్మ, సునీత, సుజాత, లియాకత్, అంజనేయులు, ప్రవీణ్ పాల్గొన్నారు.

ఆభరణాల తయారీకి బంగారం వితరణ

మక్తల్‌టౌన్, మార్చి 23: మక్తల్ పట్టణంలోని సీతారాముల ఆభరణాల తయారీకి శనివారం మున్సిపల్ చైర్‌పర్సన్ పావనీమల్లికార్జున్ పది గ్రాముల బంగారాన్ని వితరణ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రీరామ నవమి సందర్భంగా రామ్‌లీలా మైదానంలో పడమటి ఆంజనేయస్వామి దేవాలయం తరపున నిర్వహించే సీతారాముల కల్యాణోత్సవం ఆభరణాల తయారీ కోసం బంగారం ఇచ్చామని తెలిపారు. కార్యక్రమంలో ఆలయ జూనియర్ అసిస్టెంట్ కుమ్మరి శ్రీనివాసులు, బీజేపీ నాయకుడు మంజునాథ్ పాల్గొన్నారు.

ఫ్యాన్ వితరణ

దామరగిద్ద, మార్చి 23 : మండలంలోని కానుకుర్తి అంగన్‌వాడీ కేంద్రం-1కు అదే గ్రామానికి చెందిన మోహన్‌రెడ్డి, మేడిశెట్టి శివప్రసాద్ సీలింగ్‌ఫ్యాన్, గోడగడియారాన్ని అందజేశారు.

టీ సేఫ్ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

- నారాయణపేట ఎస్పీ యోగేష్‌గౌతమ్

మాట్లాడుతున్న డీఎస్పీ లింగయ్య

నారాయణపేట, మార్చి 23 : మహిళలకు మెరుగైన భద్రత, వారి ప్రయాణ పర్యవేక్షణ కోసం టీ సేఫ్ సేవలను తెలంగాణ పోలీస్ ఉమెన్ సేఫ్టీ విభాగం అందుబాటులోకి తీసుకొచ్చిందని ఎస్పీ యోగేష్‌గౌతమ్ శనివారం ప్రకటనలో పేర్కొన్నారు. ఏ రకం మొబైల్‌లో అయినా టీ సేఫ్ ద్వారా పోలీస్ భద్రత పొందవచ్చన్నారు. మహిళలు ప్రయాణించే దూరాన్ని టీ సేఫ్ మానిటరింగ్ చేస్తుందన్నారు. ఈ యాప్‌ను ఉపయోగించడం ద్వారా వ్యక్తిగత సమాచారం బహిర్గతం అవ్వదని, ప్రయాణ సమయంలో అభద్రతకు గురైనప్పుడు, టీ సేఫ్ సేవలు వినియోగించుకోవాలన్నారు. పెండింగ్ కేసులను వేగవంతంగా పరిష్కరించాలని డీఎస్పీ లింగయ్య అన్నారు. శనివారం పట్టణంలోని డీఎస్పీ కార్యాలయంలో మక్తల్ సర్కిల్ పరిధిలోని పోలీస్ అధికారులతో పెండింగ్ కేసులపై సమీక్షా సమావేశం నిర్వహించి మాట్లాడారు. ప్రతి కేసును పారదర్శకంగా విచారణ చేసి శిక్షల శాతం పెంచాలన్నారు. గంజాయి, గుట్కా, పేకాటలపై ప్రత్యేక తనిఖీలు చేపట్టాలన్నారు. పోక్సో, ఎస్సీ, ఎస్టీ గ్రేవ్ కేసులను త్వరితగతిన విచారణ చేసి 60 రోజుల్లో కోర్టులో చార్జ్‌షీటు దాఖలు చేయాలన్నారు. దొంగతనాల నిర్మూలనకు పెట్రోలింగ్ అధికారులు రాత్రి సమయంలో పాత నేరస్తులను తనిఖీ చేయాలన్నారు.

సమావేశంలో సీఐ చంద్రశేఖర్, ఎస్సైలు భాగ్యలక్ష్మి రెడ్డి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

నీటితో పోయేది.. రాయిదాకా తెచ్చుకోవద్దు

మాట్లాడుతున్న డాక్టర్ అమిత్‌మన్కల్

పాలమూరు, మార్చి 23: మహబూబ్‌నగర్‌లోని ఎన్టీఆర్ మహిళా డిగ్రీ కళాశాలలో శనివారం జంతుశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో కిడ్నీ స్టోన్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యవక్తగా డాక్టర్ అమిత్ మన్కల్ కిడ్నీ స్పెషలిస్ట్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనం కిడ్నీ స్టోన్స్ గా పిలువబడే రీనల్ కాల్కులి నెఫ్రో లుతియాసిన్, యూరో లేతియాసిసి ఇవన్నీ అహారంలో దేహానికి అందిన మినరల్స్ స్టాల్స్ మూత్రం ద్వారా విసర్జితం కాకుండా ఒక చోట కేంద్రీకృతం కావడం ద్వారా ఏర్పడుతాయని అన్నారు. కాంపౌండ్స్‌ను బట్టి వీటిని కాల్షియం స్టోన్స్, క్రిస్టైన్, యూరిక్ యాసిడ్ స్టోన్స్, స్ట్రన్స్‌గా వర్గీకరిస్తామన్నారు. కిడ్నీ స్టోన్స్ రావడానికి గల కారణాలు చూస్తే కొందరిలో ఫ్యామిలీ హెల్త్ హిస్టరీ, దేహం డిహైడ్రేషన్స్‌కు గురికావడంతో పాటు ప్రొటీన్, సోడియం, షుగర్ మోతాదుకు మించి తీసుకోవడం, మన సొంత తప్పిదాల వల్ల కొన్ని రకాల ఆపరేషన్ల సైడ్ ఎఫెక్ట్స్ వల్ల కూడా కిడ్నీలో రాళ్లు ఏర్పడుతుంటాయని తెలిపారు. అనంతరం డాక్టర్ దివ్యమన్కల్ మాట్లాడుతూ మూత్ర పిండాలు శరీరంలోని వ్యర్థ పదార్థాలను బయటకు పంపించడమే కాకుండా ఎరిత్రోసైటిస్ అనే హార్మోన్‌ను విడుదల చేస్తూ రక్తం పరిమాణాన్ని నియంత్రిస్తాయన్నారు. అనంతరం కళాశాల యాజమాన్యం వారిని శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డా.విజయ్‌కుమార్, వైస్ ప్రిన్సిపాల్ గంగాధర్, అమీనా ముంతాజ్ జహన్, ఐక్యూ ఈఏసీ కోఆర్డినేటర్ డా.విజయలక్ష్మి, అకాడమిక్ కోఆర్డినేటర్ లావణ్య, జంతుశాస్త్ర విభాగాధిపతి స్వాతి, అధ్యాపకులు, విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

చెక్కును అందజేస్తున్న వీసీ లక్ష్మీకాంత్‌రాథోడ్

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

పాలమూరు, మార్చి 23: స్థానిక పాలమూరు విశ్వవిద్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న సత్యనారాయణ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన సతీమణి నందినికి శనివారం పాలమూరు విశ్వవిద్యాలయం తరపున పీయూ ఉపకులపతి ప్రొ. లక్ష్మీకాంత్‌రాథోడ్ రూ.3.50లక్షల చెక్కును వారి కుటుంబానికి ఆర్థిక సహాయంగా అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎవరైనా నాన్ టీచింగ్ సభ్యులు మరణిస్తే రూ.లక్ష రూపాయల ఎక్స్‌గ్రేషియాను ఇచ్చే వారని, ప్రస్తుతం రూ.3లక్షల 50వేలకు పెంచారని అన్నారు. ఈ సందర్భంగా నాన్ టీచింగ్ సంఘాల నాయకులు వారికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్ డా.మధుసూదన్‌రెడ్డి, అసిస్టెంట్ రిజిస్ట్రార్ వెంకటేశ్వర్లు, సూపరింటెండెంట్ రవీందర్ తదితరులు ఉన్నారు.

మానవ సేమే.. మాధవ సేవ

పాలమూరు, మార్చి 23: మహబూబ్‌నగర్ పీయూ ఎన్ఎస్ఎస్ యూనిట్-1 వలంటీర్స్ ప్రత్యేక శిబిరంలో భాగంగా శనివారం కొత్తపేటలో ముగింపు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు పాలమూరు విశ్వవిద్యాలయ ఉపకులపతి ప్రొఫెసర్ ఎల్.బీ.లక్ష్మీకాంత్‌రాథోడ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవ సేవే మాధవ సేవ అని, ఈ జాతీయ సేవా పథకం 1969 సెప్టెంబర్ 24న నెలకొల్పారని అన్నారు. దీని లక్ష్యం గ్రామీణ ప్రాంతాల్లో మూఢనమ్మకాలు, బాల్య వివాహాలు, సామాజిక రుగ్మతలను రూపుమాపడమే అని చెప్పారు. అనంతరం విద్యార్థులు ఆయనను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్ రవికుమార్, స్పెషల్ ఆఫీసర్ వెంకట్‌రెడ్డి, హెచ్ఎం నర్సింహారావు, అధ్యాపకులు రవి, వలంటీర్లు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

నారాయణపేట, మార్చి 23 : 2024 విద్యా సంవత్సరానికి గానూ మహాత్మా జ్యోతిబాపూలే విదేశీ విద్యానిధి పథకానికి బీసీ, ఈబీసీ విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని బీసీ సంక్షేమశాఖ జిల్లా అధికారి కృష్ణమాచారి శనివారం ప్రకటనలో పేర్కొన్నారు. 2024 జూలై 1నాటికి అభ్యర్థుల వయస్సు 35ఏండ్ల లోపు ఉండాలని, కుటుంబ వార్షిక ఆదాయం రూ.5లక్షలకు మించరాదన్నారు. ఇంజినీరింగ్, మేనేజ్‌మెంట్, ఫ్యూర్ సైన్స్, అగ్రికల్చర్ సైన్స్, మెడిసిన్, నర్సింగ్, సోషల్ సైన్స్, హ్యూమనిటీస్ రంగాల్లో 60శాతం మార్కులు పొంది ఉండాలన్నారు.

ఓఈఎఫ్ఎల్, జీఆర్ఈ, జీఎమ్ఏటీలలో మినిమమ్ స్కోర్ ఉండి, విదేశీ యూనివర్సిటీల్లో ప్రవేశాలకు ఆహ్వానం, వీసా కలిగి ఉండాలన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు www.telanganaepass.cgg.gov.in వెబ్‌సైట్‌లో ఏప్రిల్ 5వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు.

చిన్నరాజమూర్‌లో ఫ్లాగ్‌మార్చ్

దేవరకద్ర, మార్చి 23 : గ్రామంలో ప్రతి ఒక్కరూ నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని జిల్లా పోలీసులతోపాటు కేంద్ర బలగాలు అండగా ఉంటాయని ప్రజలకు భరోసా కల్పిస్తూ మండలంలోని చిన్న రాజమూర్‌లో శనివారం పోలీసులు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. కార్యక్రమంలో దేవరకద్ర ఎస్సై నాగన్న, పోలీసులు ఉన్నారు.

లోక్ అదాలత్‌తో కేసుల సత్వర పరిష్కారం

నారాయణపేట, మార్చి 23 : లోక్ అదాలత్‌లో కేసులను సత్వరం పరిష్కరించుకోవచ్చని జిల్లా సెషన్స్ జడ్జి మహ్మద్ అబ్దుల్ రఫీ అన్నారు. శనివారం పట్టణంలోని కోర్టు ఆవరణలో అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఎక్సైజ్, పోక్సో, ఆన్‌లైన్ ట్రేడింగ్, యాక్సిడెంట్, పెండింగ్ క్రిమినల్ కేసులు, కోర్టు మరమ్మతులపై సమీక్షించారు. ఈనెలలో నిర్వహించిన లోక్ అదాలత్ ద్వారా 3,438 కేసులు పరిష్కారం అయ్యాయని తెలిపారు. ఇంకా 5,500 కేసులను పరిష్కరించాల్సి ఉందన్నారు. మే 11న నిర్వహించే లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి శ్రీనివాస్, జూనియర్ సివిల్ జడ్జి మహ్మద్‌ఉమర్, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి జకియా సుల్తానా, కోస్గి జూనియర్ సివిల్ జడ్జి ఫార్‌హాన్ బేగం, డీఎస్పీ లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

న్యాయవిజ్ఞాన సదస్సు

నారాయణపేట రూరల్, మార్చి 23 : మండలంలోని అప్పక్‌పల్లి, అప్పిరెడ్డిపల్లిలో శనివారం చీఫ్ డిఫెన్స్ కౌన్సిల్ లక్ష్మీపతిగౌడ్ ఆధ్వర్యంలో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా పబ్లిక్ ప్రాసిక్యూటర్ సురేశ్ హాజరై వ్యవసాయ చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో చీఫ్ డిఫెన్స్ కౌన్సిల్ లక్ష్మీపతిగౌడ్, అసిస్టెంట్ డిఫెన్స్ కౌన్సిల్ నాగేశ్వరి పాల్గొన్నారు.

రక్తదానం.. ప్రాణదానం

పాలమూరు, మార్చి 23: జిల్లా కేంద్రం శివారులోని జయప్రకాశ్ నారాయణ ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం షహీద్ దివస్‌లో భాగంగా భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ వర్ధంతులను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బలగం సినిమా నటుడు మైము మధు ముఖ్యఅతిథిగా హాజరై భగత్ సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కళాశాలలో రక్తదాన శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్, ప్రిన్సిపాళ్లు పాల్గొన్నారు.

మోకీళ్ల మార్పిడికి రోబోటిక్ శస్త్రచికిత్స

- సీనియర్ ఆర్థోపెడిక్ సర్జన్, డాక్టర్ సునీల్ దాచేపల్లి

రోబోటిక్ సర్జరీలపై మాట్లాడుతున్న వైద్యులు సునీల్ దాచేపల్లి

మహబూబ్‌నగర్ మెట్టుగడ్డ, మార్చి 23: మోకీళ్ల మార్పిడికి అత్యాధునిక రోబోటిక్ శస్త్రచికిత్సలు అందనున్నాయని రోబోటిక్ కీళ్ల మార్పిడి, సీనియర్ ఆర్థోపెడిక్ సర్జన్, డాక్టర్ సునీల్ దాచేపల్లి అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని హిమాలయా సమావేశ హాల్‌లో యశోద హాస్పిటల్ వారి ఆధ్వర్యంలో కీళ్ల మార్పిడి శస్త్రచికిత్సలపై అవగాహన, రోబోటిక్ సర్జరీలపై డా. సునీల్ మాట్లాడారు. ప్రస్తుత సమాజంలో చాలామందికి మోకాళ్ల నొప్పుల సమస్యలు వస్తున్నాయని, మోకాళ్ల అరుగుదలకు చాలా రకాల చికిత్సలు వచ్చాయని అన్నారు. మొదటి, రెండు దశల్లో ఇంజక్షన్ తీసుకోవచ్చన్నారు. మూడో దశలో తప్పనిసరిగా శస్త్రచికిత్స మాత్రమే పనిచేస్తుందన్నారు. చాలామంది శస్త్రచికిత్సకు భయపడి ఇంజక్షన్ మాత్రమే చేసుకొని మోసపోతున్నారని, మోకాళ్ల అరుగుదలను గుర్తించి వెంటనే శస్త్రచికిత్స చేయించుకోవాలని సూచించారు. మోకీళ్ల మార్పిడి చేసుకోవడం వల్ల ఎలాంటి సమస్యలు ఉండవన్నారు. రోబోటిక్ సహాయంతో చికిత్స చేయడం ద్వారా ఎక్కువకాలం ఎలాంటి నొప్పులు ఉండవన్నారు. మోకాళ్ల సమస్యలు ఉన్న 400 మందికి రోబోటిక్ సర్జరీలు ఇప్పటి వరకు విజయవంతంగా చేశామని తెలిపారు. ఈ సర్జరీకి రూ.1.50లక్షలు ఖర్చు అవుతుందని చెప్పారు.

బాధ్యతయుతంగా విధులు నిర్వహించాలి

దేవరకద్ర, మార్చి 23 : పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా అధికారులు బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని దేవరకద్ర నియోజకవర్గ ఎన్నికల సహాయాధికారి, స్పెషల్ కలెక్టర్ ముకుంద రెడ్డి సూచించారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో ఎస్ఎస్‌టీ, ఎఫ్ఎస్‌టీ, వీవీటీ అధికారులతోపాటు నోడల్ అధికారులకు ఒక రోజు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని శిక్షకులు బ్రహ్మంగౌడ్ ఇచ్చారు. కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్ రాంరెడ్డి, తాసీల్దార్ శ్రీనివాసులు, డీటీ అబ్దుల్ రహమాన్, దీపిక, శివారాజ్ ఉన్నారు.

27న వాలీబాల్ టోర్నీ

నవాబ్‌పేట, మార్చి 23 : మండలంలోని పల్లెగడ్డ గ్రామంలో ఆది బసవేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని ఈనెల 27న మండల స్థాయి వాలీబాల్ టోర్నీ నిర్వహించనున్నట్లు నిర్వాహకులు బాలరాజు, విజయ్‌కుమార్ తెలిపారు. విజేతకు ప్రథమ బహుమతిగా రూ.10వేలు, ద్వితీయ బహుమతి రూ.5వేలు, తృతీయ బహుమతి రూ.2,500, ట్రోఫీ అందజేయనున్నట్లు తెలిపారు. వివరాలకు 9666 445032, 8498811364ను సంప్రదించాలని కోరారు.

యువతి అదృశ్యం

రాజాపూర్ మార్చి 23: మండలంలోని తిర్మలాపూర్ గ్రామానికి చెందిన యువతి అదృశ్యమైన ఘటన రెండ్రోజుల కిందట చోటు చేసుకున్నది. ఎస్సై రవి కథనం మేరకు గ్రామానికి చెందిన యువతికి, అదే గ్రామానికి చెందిన శ్రీధర్‌తో ఏడాది వివాహం చేశారు. ఈనెల 21న ఉదయం యువతి పుట్టింటికి వెళ్లింది. సాయంత్రం తిరిగి మా ఇంటికి వెళ్తున్నానని తల్లిదండ్రులకు చెప్పి అక్కడి నుంచి బయలుదేరింది. రాత్రి వరకు కూడా రాకపోవడంతో భర్త, అత్తా మామలకు ఫోన్ చేశాడు. ఇరుకుటుంబాల ఇళ్లలో ఆమె లేకపోవడంతో అందరూ వెతికారు. ఎక్కడా ఆచూకీ లభించకపోవడంతో యువతి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

యువకుడు..

రాజాపూర్, మార్చి 23 : మండలంలోని చొక్కంపేటకు చెందిన యువకుడు మంచాల రాజు (23) రెండ్రోజులుగా కనిపించడం లేదు. ఎస్సై రవి తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన మంచాల పెంటయ్య పెద్దకుమారుడు రాజు ఈనెల 20న రాత్రి గ్రామంలోకి వెళ్లి వస్తానని చెప్పి వెళ్లాడు. తిరిగి ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు వ్యవసాయ పొలంతో పాటు చుట్టుపక్కల గ్రామాల్లో వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో శనివారం యువకుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

లిక్కర్ పట్టివేత

నారాయణపేట రూరల్, మార్చి 23 : పార్లమెంట్ ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున టాస్క్‌ఫోర్స్ పోలీసులు విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. మండలంలోని పేరపళ్లలో టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఆంజనేయులు కిరాణంలో 15 లీటర్ల లిక్కర్, అశోక్ హోటల్‌లో 7.38 లీటర్ల లిక్కర్‌ను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై వెంకటేశ్వర్లు తెలిపారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున బెల్టుషాపులు నిర్వహిస్తున్న వారిపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు.

ఇద్దరికి గాయాలు

మిడ్జిల్, మార్చి 23: కారు, బైక్‌ను ఢీకొట్టడంతో ఇద్దరు గాయపడిన ఘటన మండలంలోని రాణిపేటలో చోటుచేసుకున్నది. ఎస్సై ఆనంద్ కథనం మేరకు వల్లభురావుపల్లి గ్రామానికి చెందిన వెంకటేశ్, రామస్వామి బైక్‌పై మిడ్జిల్‌కు వస్తుండగా, రాజాపూర్ మండలం ముదిరెడ్డిపల్లికి చెందిన హోంగార్డు సుదర్శన్ తన కుటుంబ సభ్యులతో కారులో శ్రీశైలం బయలుదేరారు. రాణిపేట గ్రామ సమీపంలో ప్రధాన రహదారి వద్ద వెనుక నుంచి ఢీ కొట్టడంతో బైక్ పై వెళ్తున్న ఇద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. దీంతో వారిని చిక్సిత నిమిత్తం అంబులెన్స్‌లో జిల్లా ప్రభుత్వ దవాఖానకు తరలించారు. ఒకరి పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చిక్సిత కోసం హైదరాబాద్ తరలించారు.

ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య

భూత్పూర్, మార్చి 23 : మున్సిపాలిటీ పరిధిలోని 2వ వార్డుకు చెందిన దేవులనాయక్(42) శుక్రవారం రాత్రి ఉరేసుకొని మృతి చెందినట్లు ఎస్సై శ్రీనివాసులు తెలిపారు. మృతుడు దేవుల, భార్య లక్ష్మి, ఇద్దరు పిల్లలతో కలిసి హైదరాబాద్‌లోని చంపాపేటలో కూలి పని చేస్తూ జీవనం సాగిస్తూ ఉండేవాడు. ఆర్థిక ఇబ్బందులతో గొడవపడి హైదరాబాద్ నుంచి వచ్చాడు. ఆర్థిక ఇబ్బందులతోనే ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

చెక్కులు అందజేత

భూత్పూర్, మార్చి 23 : ప్రభుత్వం నుంచి మంజూరైన కల్యాణలక్ష్మి చెక్కులను తాసీల్దార్ రాజు శనివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్తగా పెళ్లైన 66మందికి కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఫలాలను పేదలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయబ్ తాసిల్దార్ గీత, ఆర్ఐలు వెంకటేశ్ ఉన్నారు.

WANTED TEACHING & NON-TEACHING STAFF

Wanted Senior & Junior Lecturers to teach (Inter + EAPCET + NEET + JEE Mains) for the following subjects specified. Salary is Negotiable for the experienced and deserving Candidates.

| Subject | No.